నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | MEDAK



నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) పరిధిలోని శేరితండాలో ఎడ్లబండిపై నీటిని తీసుకెళ్లేందుకు వ్యవసాయ బోరు వద్ద వేచి ఉన్న ప్రజలు

# తండాల్లో..తాగునీటి తిప్పలు

## నారాయణఖేడ్ ప్రాంతంలో మళ్లీ 'ఆనాటి రోజులు'





వ్యవసాయ బోరు వద్ద నీటిని తీసుకెళ్తున్న శేరి తండావాసులు

- 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్
- దిక్కయిన వ్యవసాయ బోర్లు
- మూడు తండాల్లో తాగునీటికి కటకట
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 14: తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సమైక్య పాలనలో నీటి కోసం కిలోమీటర్ల కొలది నడిచి వెళ్లడం, ఎడ్లబండ్లు, బైక్లపై ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి నీటిని తరలించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, ఉన్న ఒక్క బోరుమోటారు వద్ద గుంపులుగా చేరి నీళ్లు పట్టుకోవడం, రెండు తండాల మధ్య ఉన్న ఒక బోరు కోసం రెండు తండాల ప్రజలు ఘర్షణకు దిగిన దృశ్యాలు సర్వసాధారణంగా కనిపించేవి. బిందెడు నీళ్ల కోసం గిరిజనులు ప్రమాదకరమైన లోతైన బావుల్లో నుంచి నీటిని తోడుకుంటున్న చిత్రాలు ఆనాడు పత్రిక శీర్షికలయ్యాయి. వీటన్నింటికి చరమగీతం పాడుతూ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించింది మిషన్ భగీరథ పథకం. నారాయణఖేడ్ నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్య దృష్ట్యా మిషన్ భగీరథ పథకాన్ని యుద్ధప్రాతిపదికన కేసీఆర్ పూర్తిచేయించారు. ఫలితంగా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య వందశాతం పరిష్కారం అయ్యిందనడంలో ఎలాంటి సందేహం లేదు. దశాబ్దాలుగా మంచి నీటి కష్టాలను ఎదుర్కొన్న నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలను మిషన్ భగీరథ పథకం వరప్రదాయినిలా మారి ఆదుకున్నది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మారుమూల తండాల్లోనూ ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని సరఫరా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మిషన్ భగీరథ పథకం సమర్థవంతంగా కొనసాగించడంతో ఎప్పుడూ నీటి సమస్య ఉత్పన్నం కాలేదు. ఏ ఒక్కరోజూ నీటికోసం ప్రజలు పరుగులు పెట్టిన దృశ్యాలు కనిపించలేదు. అందుకు భిన్నంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరిగి నీటి సమస్య నెలకొంది. ఎండాకాలం ఆరంభంలోనే మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నిర్వహణను సరిగ్గా పట్టించుకోక పోవడంతో నీటి సమస్యలు నెలకొన్నాయి. గ్రామాలు, తండాలకు రోజుల తరబడి నీరు సరఫరా కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిస్థితులు చూస్తుంటే 'ఆనాటి రోజులు' మళ్లీ వచ్చాయనే ఆందోళన ప్రజల్లో కనిపిస్తున్నది.

### తడారుతున్న గిరిజనుల గొంతులు

ఈ వేసవిలో తండాల గొంతులు తడారుతున్నాయి. నీటి కోసం కిలోమీటర్లు వెళ్లాల్సిన అనివార్యత నెలకొందని గిరిజనులు వాపోతున్నారు. నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) పరిధిలోని శేరితండా, అక్లయితండా, గైరాన్తండాల్లో 16 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తండా వాసులు నాలుగైదు కిలోమీర్లు వెళ్లి వ్యవసాయ బోర్లను ఆశ్రయించి నీటిని తెచ్చుకుంటున్నారు. సమైక్య పాలనలో మాదిరిగానే ఎడ్లబండ్లు, బైక్లపై నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంతటి దారుణ పరిస్థితి అధికారులకు తెలియనిది కాదు. తండావాసులు అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పూటగడిచేందుకు పని చేయడం ఒక వంతైతే, నీటిని సమకూర్చుకోవడం మరో వంతుగా మారింది ఈ ప్రాంత వాసులకు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మే, జూన్ నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రం కానున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారులు పట్టించుకుంట లేరు..



శేరితండా, అక్లయితండా, గైరాన్ తండాలకు రెండు వారాల సంది మిషన్ భగీరథ నీళ్లు అస్తలేవు. ఆఫీసర్లకు చెప్పినా పట్టించుకుంట లేరు. నీళ్లకు చాలా కష్టమైతంది. నీళ్ల కోసం నాలుగైదు కిలోమీటర్లు అల్లాపూర్, చాప్టా(కె) దాకా పోవాల్సి వస్తున్నది. బైక్లు, ఎడ్ల బండ్ల మీద నీళ్లు నింపుకస్తున్నం. ఆఫీసర్లు మనసుపెట్టి మల్ల మిషన్ భగీరథ నీళ్లు వచ్చేటట్ల చెయ్యాలే. గతంల టీఆర్ఎస్ ప్రభుత్వంల ఎప్పుడు కూడా ఇన్ని రోజులు నీళ్లు బంద్ కాలేదు.

– శంకర్ నాయక్, శేరితండా


# ఉప కాలువలు నిర్మించి నీళ్లు తీసుకెళ్లాలి



తుక్కాపూర్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్రెడ్డి

- డిపాజిట్ రానివాళ్లు శంకుస్థాపలనకు ఆరాట పడుతున్నారు..
- కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది..
- ఉద్యమాలకు ఊపిరి ఊదిన దుబ్బాక
- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- సన్నాహక సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్రెడ్డి

తొగుట, ఏప్రిల్ 14: ఉప కాలువలు నిర్మించి దుబ్బాక నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో నీళ్లందించిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు సాగునీళ్లు తీసుకెళ్లాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్రెడ్డి అన్నారు. సోమవారం తుక్కాపూర్లోని లక్ష్మీనర్సింహ స్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ మల్లన్నసాగర్ నిర్మించి ప్రధాన కాలువల పనులు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉప కాలువలు సైతం నిర్మించడం లేదన్నారు. దీంతో నియోజకవర్గ రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. ఉప కాలువలు నిర్మించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. డిపాజిట్ రానివాళ్లు కొబ్బరికాయలు కొట్టడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ గెలుపు ఖాయమని కొత్త ప్రభాకర్రెడ్డి అన్నారు. తాను ఆపదలో ఉన్నా మీరంతా ఒక్కటై ఘన విజయం అందించారని, మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దుబ్బాక అంటేనే ఉద్యమాల గడ్డ అని, కేసీఆర్ ఏ పిలుపు ఇచ్చినా నియోజకవర్గ ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి విజయవంతం చేశారని గుర్తుచేశారు. అంతకుముందు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సంర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ కె. హరికృష్ణారెడ్డి, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు గోవర్ధన్రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ కలీమోద్దీన్, మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్లు బక్క కనకయ్య,గడీల అనిత, మాజీ వైస్ చైర్మన్లు కంది రాంరెడ్డి, యాదగిర, నాయకులు మల్లారెడ్డి, అరుణ్కుమార్, నరేందర్గౌడ్, మంగ నర్సింహులు, యాదగిరి, బాలరాజు, భాస్కర్, ప్రభాకర్ రెడ్డి, ఎల్లాగౌడ్, చెన్రాజ్ అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి



మిరుదొడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మొక్కుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్ 14 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మిరుదొడ్డిలో బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఇద్దరు వేర్వేరుగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాజేశం, మాజీ ఎంపీపీ సాయిలు, మాజీ సర్పంచ్ రోశయ్య, మాజీ ఎంపీటీసీ స్వామి, నాయకులు మల్లయ్య, మంకయ్య, లింగం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్టికల్ - 3తోనే తెలంగాణ సాధ్యమైంది

- అంబేద్కర్ అందరివాడు..తెలంగాణకు మరింత దగ్గరి వాడు..
- ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్లో ఏర్పాటు చేసుకున్నాం..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్రావు
- కొల్లూర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళి

రామచంద్రాపురం, ఏప్రిల్ 14 : అంబేద్కర్ ముందుచూపుతోని రాజ్యాంగంలో మెజార్టీ అనే పదాన్ని తొలిగించి ఆర్టికల్ 3ని ప్రవేశపెట్టడంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్రావు అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీలోని కొల్లూర్లో అంబేద్కర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు మాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కురుమ సంఘం సీనియర్ నాయకుడు క్యామ మల్లేశం, బీఆర్ఎస్ పటాన్చెరు ఇన్ఛార్జి ఆదర్శ్రెడ్డితో కలిసి అంబేద్కర్ విగ్రహానికి హరీశ్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కేక్ కట్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఎమ్మెల్యేలు 119 ఉంటే, ఏపీ ఎమ్మెల్యేలు 175 ఉండేవారని, మెజార్టీ అనే పదాన్ని తొలిగించకపోతే తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ రాకపోయేదన్నారు. అంబేద్కర్ కొందరివాడు కాదని..అందరివాడని..తెలంగాణకు మరింత దగ్గరి వాడు అని పేర్కొన్నారు. చీకట్లో ఉన్న వారికి వెలుగు చూపిన మహనీయుడు అని కొనియాడారు. ప్రపంచంలోని గొప్ప విశ్వవిద్యాలయాల్లో చదువుకొని తాను సంపాధించిన జ్ఞానాన్ని దేశ ప్రజల కోసం, అట్టడుగు వర్గాల కోసం ఉపయోగించి గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు. దేశంలో ప్రజలందరూ సమాన హక్కులు పొందుతున్నామంటే, దానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమని తెలిపారు. మహిళలకు, కార్మికులకు దళిత, గిరిజన అన్ని వర్గాల్లో అంబేద్కర్ వెలుగులు నింపారని ఉద్ఘటించారు. చదవండి,బోధించండి,సమీకరించండి, పోరాడండి అనే మంత్రాన్ని చెప్పాడని, దానిని ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు.

## సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టిన ఘనత కేసీఆర్దే..



కొల్లూర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్రావు



కొల్లూర్లో మాజీమంత్రి హరీశ్రావుకు కేక్ తినిపిస్తున్న నాయకులు

చదువు లేకుంటే జీవితం లేదు, వివక్షపై పోరాటం చేయాలని అంబేద్కర్ పిలుపునిచ్చారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేసీఆర్ రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టారని, ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్లో ఏర్పాటు చేయించిన ఘనత కేసీఆర్కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్యాదవ్, నాయకులు సోమిరెడ్డి, బాల్రెడ్డి, యాదయ్య, వెంకట్రామిరెడ్డి, నర్సింములు, బుచ్చిరెడ్డి, లచ్చిరాంనాయక్, బాబ్జీ, నాగరాజు, సాగర్, సురేశ్, శ్రీనివాస్, పి.శ్రీనివాస్, మహిపాల్, ప్రవీణ్, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పథకాలు ఇస్తే.. కాంగ్రెస్ బంద్ చేసింది..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శ
- గాడిచర్లపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



గాడిచర్లపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్రావు

సిద్దిపేట, ఏప్రిల్ 14 : దళితుల సంక్షేమానికి కేసీఆన్ పథకాలు అమలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలు బంద్ చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని గాడిచర్లపల్లిలో సోమవారం అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రారంభించిన అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకానికి కాంగ్రెస్ నిధులు ఇవ్వడం లేదన్నారు. దళిత, గిరిజన పేద పిల్లలు చదివే బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఎన్నికల్లో అంబేద్కర్పై అభ్యర్థిని పోటీకి పెట్టి ఆయన్ను అవమానించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ది అన్నారు. ఆయనను అనేక రకాలుగా అవమానించారని, కనీసం భారతరత్న కూడా ఇవ్వలేదు అన్నారు. నాటి ప్రధాని వీపీ సింగ్ అంబేద్కర్కు భారతరత్న ప్రకటించి గౌరవించారన్నారు. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క దళితుడుకి రూపాయి ఇవ్వలేదని, ఒక్క దళితుడిని విదేశాలకు పంపించలేదని, దళితబంధు పథకం బంద్ చేసిందన్నారు. కేసీఆర్ కిట్టు, బతుకమ్మ చీరలు, అన్నీ బంద్ చేసినట్లు విమర్శించారు. ఒక్క హామీ సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాతూరి శ్రీనివాస్, గురజాడ శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు కొత్త కనకయ్య, సుందు స్వామి, యాదగిరి, రవి, లింగం, కనకయ్య, రాజు, బాబు, కె.రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



తెల్లాపూర్లో బీరప్ప స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్రావు, పక్కన క్యామ మల్లేశం, ఆదర్శ్రెడ్డి

# కురుమ జాతిని గౌరవించింది కేసీఆర్ ఒక్కరే..

- కురుమల అభివృద్ధికి బీఆర్ఎస్ పాటుపడింది..
- రాజకీయ అవకాశాలు కల్పించాం
- తెల్లాపూర్లో బీరప్ప ఆలయానికి ఎకరం భూమి కేటాయించాం..
- మల్లన్న దేవుడి పేరుతో మల్లన్నసాగర్ నిర్మించాం
- తెల్లాపూర్లో మాజీ మంత్రి హరీశ్రావు

రామచంద్రాపురం, ఏప్రిల్14: రాష్ట్రంలో కురుమ జాతిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కురుమ సంఘానికి చెందిన ఎగ్గె మల్లేశంను పిలిచి ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించింది కేసీఆర్ అని మాజీ మంత్రి హరీశ్రావు అన్నారు. సోమవారం తెల్లాపూర్లో బీరప్ప జాతరకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ఇంతపెద్ద బీరప్ప జాతర ఎక్కడా చూడలేదన్నారు. ఈ ప్రాంతం హైదరాబాద్కు దగ్గరగా ఉన్నప్పటికీ ఇక్కడి మహిళలు గంపలను ఎత్తుకొని స్వామివారికి ఒడిబియ్యం తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీరప్ప ఆలయం కోసం భూమి కావాలని కురుమ సంఘం పెద్దలు తన దృష్టికి తీసుకువచ్చినప్పుడు, హెచ్ఎండీఏ అధికారులు రూ.40కోట్లు విలువ చేసే భూమిని ఎలా ఇస్తామని చెప్పారని, గ్రామ అవసరాల కోసం భూమిని కేటాయించాలని అప్పుడు మున్సిపల్ చైర్పర్సన్ లలితాసోమిరెడ్డి అలిగి తన పదవికి రాజీనామా చేస్తానని కాగితం కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఆయనతో రాజీనామా చేయించకుండా అప్పుడు సీఎం కేసీఆర్తో చర్చించి గ్రామస్తుల డిమాండ్ను చెప్పి బీరప్ప ఆలయం కోసం ఎకరం భూమిని, ఇతర అవసరాల కోసం ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి కేటాయించినట్లు గుర్తుచేశారు. కురుమల ఆరాధ్య దైవం కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయ చైర్మన్గా మొదటి సారి కురుమని చేసిన ఘనత కేసీఆర్కే దక్కిందన్నారు. మల్లన్నసాగర్కు ఆ దేవుడి పేరును కేసీఆర్ పెట్టారని గుర్తుచేశారు. మల్లన్న స్వామి అంటే కేసీఆర్కి ఎంతో నమ్మకం, ఏ ముఖ్యమంత్రి కూడా మల్లన్న స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించలేదని..పట్నం వేయలేదని, మొదటిసారి కేసీఆర్ ప్రభుత్వమే మల్లన్న స్వామిని గౌరవించిందన్నారు. కాళేశ్వరం నుంచి నీళ్లను తెచ్చి మల్లన్నసాగర్లో నింపి ప్రజలకు తాగు,సాగునీరు అందించి కరువు లేకుండా తెలంగాణను సుభిక్షంగా పాలించిన ఘనత కేసీఆర్దే అన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎంతో మంది కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడ్డారని,అయినా అవేవి పట్టించుకోకుండా ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి 15టీఎంసీలు హైదరాబాద్కి తీసుకువెళ్లి ప్రజలకు తాగు నీరు అందించాలని చూస్తున్నదన్నారు. కాళేశ్వరమే లేకపోతే ఇప్పుడు హైదరాబాద్ ప్రజల గొంతు ఎట్ల తడుస్తుండే అని ప్రశ్నించారు. మంత్రిగా పదేండ్లు కొమురవెల్లి మల్లన్న స్వామికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని హరీశ్రావు అన్నారు. అనంతరం కురుమ సంఘం సభ్యులు హరీశ్రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురుమ సంఘం సీనియర్ నాయకుడు క్యామమల్లేశం, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టుకుమార్, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ ఆదర్శ్రెడ్డి, నాయకులు సోమిరెడ్డి, బాల్రెడ్డి, శ్రీకాంత్గౌడ్, రవీందర్రెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లేశం, శ్రీశైలం, అంజయ్య, దేవేందర్యాదవ్, కాల్వగడ్డ రాజ్కుమార్, దయాకర్రెడ్డి, శ్రీకాంత్రెడ్డి, చెన్నారెడ్డి, కృష్ణకాంత్, విష్ణు, కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ విద్యపై కాంగ్రెస్ శీతకన్ను

- మాటలు కోటలు.. చేతలు గడప దాటడం లేదు
- జీవో 29పై ఉద్యమించాలి
- ప్రతిభ పురస్కారాల ప్రదానంలో మాజీ మంత్రి హరీశ్రావు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 14: ప్రభుత్వ మాటలు కోటలు దాటుతున్నాయని..చేతలు గడప దటడం లేదని ఎమ్మెల్యే హరీశ్రావు విమర్శించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం సిద్దిపేట అంబేద్కర్ భవన్లో ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పేద విద్యార్థుల కోసం గురుకులాలు, హాస్టళ్లు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కార్ విద్యార్థులకు సంక్షేమాన్ని మరిచిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా విద్యార్థులకు రూపాయి ఇవ్వడం లేదన్నారు. విదేశీ విద్యకు నిధులు ఇవ్వడం లేదన్నారు. దీంతో 25 వేల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సర్కారు విదేశీ విద్య ద్వారా ఎంతో మందిని విద్యార్థులను విదేశాలకు పంపిందని..కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసిందన్నారు. కేసీఆర్ రిజర్వేషన్లు కాపాడితే, కాంగ్రెస్ జీవో 29 తెచ్చి విద్యార్థుల అవకాశాలను దూరం చేసిందని హరీశ్రావు మండిపడ్డారు.జీవో 29పై అందరూ స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అంతకుముందు ఇచ్చిన మాట ప్రకారం షెడ్యూల్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీకి రూ. 2లక్షల ఆర్థిక సహకారాన్ని హరీశ్రావు అందజేశారు. అంబేద్కర్ జయంతికి పూలమాలలు వేయడం కాదు, ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను పాటించడమే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బక్కి వెంకటయ్య, రాజనర్సు, సాయిరాం, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్రావు

# అంబేద్కర్ విధానాలను అమలు చేసిన కేసీఆర్

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



చేర్యాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చేర్యాల, ఏప్రిల్ 14: అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పని చేశారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం చేర్యాలలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ..అంబేద్కర్ భవిష్యత్తును ఊహించి రాజ్యాంగం రచించారని గుర్తు చేశారు. రాష్ట్ర సచివాలయానికి కేసీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారని, ఆయనను గౌరవించడం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా 16 నెలలుగా అంబేద్కర్ విగ్రహానికి వెళ్లకుండా దారిని మూసివేందని, అన్ని వర్గాలు ప్రశ్నించడంతో తప్పని పరిస్థితుల్లో సర్కారు దానిని తెరిచిందన్నారు. సమాజంలో మార్పు కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ ఇప్పుడు అందరివాడుగా మారిపోయాడని, ప్రపంచ దేశాలన్నీ ఆయన జయంతిని నిర్వహిస్తున్నాయని తెలిపారు. గతంలో అగ్రకులాలు తమకు రిజర్వేషన్ లేదని కొంతమేర అసంతృప్తిగా ఉండేవారని అంబేద్కర్ రచనల వల్లే నేడు వారు సైతం రిజర్వేషన్లు పొందుతున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ముస్త్యాల నాగేశ్వర్రావు, అనంతుల మల్లే శం, అంకుగారి శ్రీధర్రెడ్డి, సుంకరి మల్లేశం గౌడ్, మేడిశెట్టి శ్రీధర్, వుల్లంపల్లి కరుణాకర్, నిమ్మ రాజీవ్రెడ్డి, మంగోలు చంటి, శివగారి అంజయ్య, పెడుతల ఎల్లారెడ్డి, తాండ్ర నవీన్రెడ్డి, వండ్లకొండ శ్రీనివాస్, తిరుపతి, సిద్దిరాములు, ఎర్రోల్ల రామచంద్రం, బుడిగె శ్రీనివాస్, తాడెం రంజితాకృష్ణమూర్తి, మానస, మీస పార్వతి, బీరెడ్డి ఇన్నారెడ్డి, ఉట్కూరి అమర్, కోతి దాసు, కనకయ్య, శనిగరం లక్ష్మణ్, బంగారిగళ్ల కిరణ్కుమార్, అవుశెర్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతికి స్పందన కరువు

## స్పందించని రైతులు.. కార్యక్రమానికి గైర్హాజరు



వట్పల్లిలో భూభారతి ప్రారంభోత్సవంలో పాల్గొన్న, అధికారులు, నాయకులు

వట్పల్లి, ఏప్రిల్ 14: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి ప్రారంభోత్సవానికి ఆదరణ కరువైంది. వట్పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం భూభారతి ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని 21 గ్రామాలు ఉండగా.. కనీసం ఇరవైమంది రైతులు కూడా హాజరుకాకపోవడంతో రైతు వేదిక బోసిపోయింది. ఒక వైపు అధికారులు, మరో వైపు పార్టీ నాయకులు రైతులకు అహ్వానించినా ఏ ఒక్క గ్రామం నుంచి కనీసం ఇద్దరు రైతులు హాజరు కాలేదు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలపై నమ్మకం లేకనే రైతులు హాజరు కాలేదని తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై రైతులు, ప్రజలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆ పార్టీ నాయకులతోనే పథకాల ప్రారంభోత్సవాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలిచ్చి విస్మరించడంతోనే రైతులు దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.